చూచాయగా తెలిసినా కూడా సహించింది కానీ అది ఓపెన్‌గా, తన అనుమతితో జరగాలనేసరికి – సహించలేకపోయింది.

ఎందుకని?

పాపాయి ఏడుపు వినబడుతూనే ఉంది.

మహీధర్ భార్య ఆఫీసుకెళ్ళటానికి– తలుపు తీసుకుని బయటకొచ్చింది.

వెనుకే ఆమె భర్త__

"మా ఫ్రెండ్ వస్తానన్నాడు! వచ్చాక ఇద్దరం కలసి వెళ్తాం–" చెప్పాడతను ఆమెతో.

"ఓకే – సాయంత్రం మా ఆఫీస్ దగ్గరకొస్తారు కదూ!"

"షూర్–"

ఆమె వెళ్ళిపోయింది.

కనుమరుగయేంతవరకూ చూసి అతను తలుపులు వేసేసుకున్నాడు.

లోపల్నుంచి పరిచితమయిన నవ్వులూ– సరససల్లాపాలూ– మామూలే–

అతనికీ పనిమనిషికీ సంబంధం ఉందని అతని భార్యకు తెలుసు!

అయినా తెలీనట్లు ఆమె నటన!

సంబంధం లేదన్నట్లు అతని నటన!

ఎందుకిదంతా! ఏమిటిదంతా?

ఆ నటనే వద్దంటున్నాడు శేఖర్.

తను కావాలంటోందా? తరతరాల నుంచీ బూజుపడుతూ వస్తోన్న నమ్మకాలు!

ఊహు! కావాలనటంలేదు! కానీ తనకి తెలిసేట్లు జరగడానికి వీల్లేదంటోంది.

ఎందుకని? ఎందుకంటే–ఎందుకంటే హిపోక్రసీ మన దేశాన్ని ఏనాటినుంచో ఏలుతోంది కనుక! అందరూ దానికి బానిసలు కనుక!

అది ఉన్నవాళ్ళకే అన్ని సుఖాలూనూ!

వద్దనుకునేవాళ్ళు, లేనివాళ్ళు శేఖర్‌లా, తనలా ఒంటరిగా ప్రయాణించాల్సిందే!



# ఎండ

పాలకూర సీతాలత



పార్వతీశంగారు కిటికీలోంచి రోడ్డు మీదకు చూశారు. ఉదయం పది గంటలు కాకపోయినా ఎండ మాత్రం చాలా తీవ్రంగా ఉంది. 'ఏడాదికి ఏడాదికి ఎండలు పెరిగిపోతున్నాయి.... దొంగ వ్యాపారిలోని దురాశ లాగ....' అనుకుని చిన్నగా నిట్టూర్చారు. ఊరు పెరుగుతున్నందువల్ల చెట్లన్నీ కొట్టివేస్తున్నారు. అది కూడా ఒక కారణమే.

ఆయన ఈ మధ్యే రిటైర్ అయ్యారు. పదవీబాధ్యతలనుంచి ఆయనకు విముక్తి లభించినా, సంసారపు బాధ్యతలనుంచి మాత్రం విముక్తి లభించలేదు. ఆయనకు ఇద్దరు కొడుకులు– ఇద్దరు కూతుళ్ళు.

పెద్దకొడుకు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి పెళ్ళి కూడా అయ్యింది. అందువల్ల అతని నుంచి ఆయనకు స

1984 చక్రపాణి తృతీయ అవార్డు పొందిన కథ

విధమైన ఆర్థికసహాయం అందటం లేదు. అందుకు ఆయన బాధపడక డబ్బు కావాలంటూ ఉత్తరాలు రాయటం మానేశారు. ఒకసారి చాలా అత్యవసరం కలిగి మనసు చంపుకుని చెయ్యి చాచారు.

అందుకా సుపుత్రుడు—

"మీకు ఢిల్లీలో ఖర్చులగురించి తెలియదనుకుంటాను. ఒకసారి ఢిల్లీవచ్చి చూడండి. ఆ తర్వాత మీరు ఎన్నడూ నాకు ఇలాంటి ఉత్తరాలు రాయరని అనుకుంటాను" అంటూ జవాబు రాశాడు.

అది చూసి చిన్నగా నవ్వుకున్నారు ఆయన.

'ఢిల్లీ వెళ్ళి రాగలిగే డబ్బు చేతిలో వుంటే దాంతో ఈ అవసరాన్నే గడుపుకునేవాడు కదా!'

కొడుకు రాసిన జవాబుకి ఆయన బాధపడలేదు.... కాని అదే నెలలో ఆ కొడుకే తన మామగారికి కొంత డబ్బు పంపేడని చూచాగా తెలిశాక మాత్రం కొంచెం బాధపడ్డారు. ఆ మామగారికి వాడు పంపిన సొమ్ము ఆయన అడిగిన దానికి నాలుగు రెట్లు!

రెండో కొడుకు కాలేజీ ఫీజుకి ఆ సొమ్ము అవసరం అయ్యింది. వేరే చోట అప్పు తెచ్చి ఆ అవసరం గడిపేరు.

ఆయన పెద్దకూతురికి బంగారంలాంటి సంబంధం తెచ్చి చేశారు కానీ.... ఆ అమ్మాయి అదృష్టం బాగోనందువల్ల కాపురానికి వెళ్ళిన ఏడాదికి పసుపుకుంకుమలకు దూరమై పుట్టిల్లు చేరింది. ఆ ఇంట్లో తిరుగుతున్న కూతుర్ని చూసినప్పుడల్లా ఆయన గుండెలు బాధతో నిండిపోతాయి.

ఇక రెండో అమ్మాయికి సంబంధాలు చూస్తున్నారు. ఒకరిద్దరు వచ్చి చూసుకుని వెళ్ళారు గానీ, కట్నందగ్గర బేరం కుదరలేదు.... ప్రయత్నించక తప్పదు కనుక ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ మధ్యే ఒకళ్ళు చూసుకుని వెళ్లారు. ఇంకా ఫలితం తెలియలేదు.

"అక్కడ కూర్చుని ఏమిటి ఆలోచిస్తున్నారు? భోజనం వడ్డించనా?" అంటూ వచ్చింది ఆయన అర్థాంగి రుక్మిణి.

"చేస్తానులే .... పోస్టుమేన్ కోసం ఎదురుచూస్తున్నాను..." అన్నారు ఆయన రోడ్డుమీదకు చూస్తూ.

"వచ్చే అతను రాకుండా పోతాడా? మీరు పదండి భోజనానికి.... ఇంతకీ ఏ ఉత్తరం రావాలి?.... పెద్దాడు మనిఆర్డర్ పంపుతానన్నాడా ఏం?" అంది రుక్మిణి.

కాదన్నట్లు చిన్నగా నిట్టూర్చారు ఆయన.

"పెద్దఅమ్మాయి అత్తగారింటినుంచి ఆమె భర్త ఇన్సూరెన్సు డబ్బుగురించి ఉత్తరం రావాలి?"





"ఎందుకు వస్తుంది? ఆమె భర్తనుంచి దీనికి ఒక్క పైసా కూడా రాదు. అతడు తన తల్లిదండ్రుల పేరుమీద వున్న నామినేషను భార్యపేర మార్చలేదుగా..." అన్నారు ఆయన.

మౌనం వహించింది రుక్మిణి.

"అయినా మనకు ఆ అవసరం లేదు. సొమ్ముకోసం వాళ్ళ గుమ్మం పట్టుకుని వేళ్ళాడవలసిన అవసరం లేదు మనకి. అది నా కూతురు. దాన్ని పోషించడం నా బాధ్యత" అన్నారు ఆయన అక్కాళి మానంగా.

అప్పుడే పోస్టుమేన్ గేటు తీసి లోపలకు వస్తూవుండటంతో ఆత్రంగా అతని వైపు చూశారు. కానీ అతను పక్క పోర్షన్‌వాళ్ళకి ఉత్తరంఇచ్చి తిరిగి వెళ్ళిపోతున్నాడు.

"నాకేం ఉత్తరాలు లేవటోయ్?" అడిగారు.

పోస్టుమేన్ చిన్నగా నవ్వుతూ—

"ఉంటే నేనే వచ్చి ఇస్తానుకదండీ... మీరు విడిగా అడగాలా?" అంటూ వెళ్ళిపోయాడు.

భార్యతో—

"భోజనం వడ్డించు...." అన్నారు. రుక్మిణి లోపలకు వెళ్ళిపోయింది.

ఆమె ఎంతగా ఆలోచించినా భర్త ఏ ఉత్తరంకోసం ఎదురుచూస్తున్నదీ ఆమెకు బోధపడలేదు.

భోజనానికి కూర్చుంటూ —

"మొన్న అంజలిని చూసుకునేందుకు వచ్చివెళ్ళిన ఆ పెద్దమనిషి ఈ పాటికి ఉత్తరం రాయాల్సింది. అందుకే ఎదురు చూస్తున్నాను...." అన్నారు ఆయన.

"రాస్తారులెండి .... వాళ్ళు ఇంకా ఆలోచించుకుంటున్నారేమో!" అంది రుక్మిణి.

అంజలి వాళ్ళ చిన్నకూతురు.

పార్వతీశంగారికి ఎందుకో ఈ సంబంధం కుదురుతుందని అనిపిస్తోంది. ఆ కుర్రవాడు, అతని తల్లిదండ్రులు కూడా చాలా సమంజసంగానే మాట్లాడారు. గతంలో వచ్చిన ఆశపోతు వ్యక్తుల లాంటివారు కాదని తోస్తోంది.

భోజనం ముగించి పేపరు చూస్తూ కూర్చున్నారు ఆయన. ఆర్థిక పరిస్థితులు అంత బాగా లేకపోయినా తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఆ పెంకుటిల్లు ఆయన ఆస్తి. నిజానికి పెద్దకూతురు పెళ్ళికి దాన్ని తాకట్టుపెట్టారు. ఇంత వరకూ దాన్ని విడిపించుకోవడం కుదరలేదు. ఆ ఇంట్లోనే రెండు గదులు అద్దెకు ఇచ్చారు. ఇప్పుడు రిటైరు అయినందువల్ల వచ్చే డబ్బుతో ఈ ఇల్లు విడిపించుకోవడం, అంజలి పెళ్ళి చెయ్యడం అనే బాధ్యతలు వున్నాయి. ఆయన పెద్ద

కొడుకు ప్రేమించి పెళ్ళిచేసుకున్నందు వల్ల కష్టం రాలేదు. అందుకు ఆయన బాధపడలేదు సరికదా.... గర్వపడ్డారు.

పేపరు చదవడం ముగించి కాస్సేపు పడుం వాల్చారు.

బయట ఎండ చాలా తీవ్రంగానే ఉంది. టైము ఒంటిగంట అయ్యింది.

ఆయన రెండో కొడుకు చేతిలో పుస్తకాలతో చెమటలు కక్కుకుంటూ వచ్చాడు. అతను ఇంటర్ ఫైనల్ ఇయర్లో వున్నాడు. పబ్లిక్ పరీక్షలు ముందున్నాయి. ఇప్పుడు ప్రిపరేషన్ హాలీడేస్.

"ఎక్కడకు వెళ్ళావురా ఎండలో!" అడిగారు ఆయన.

"ఫ్రెండు ఇంటికి వెళ్ళి పుస్తకం తెచ్చుకున్నాను నాన్నా! ఇది నా దగ్గర లేదు. కాస్సేపు ఇద్దరం కూర్చుని కంబైన్డ్‌గా స్టడీ చేశాం...." అన్నాడు రమణ.

"బాగుంది... భోజనానికి రా...." అంటూ ప్రేమగా పిలిచి ఆప్యాయంగా వడ్డించింది రుక్మిణి.

చదువు గురించి పట్టించుకుంటున్న రమణను చూసి తృప్తిగా తల ఆడించారు పార్వతీశంగారు.

కానీ .... రమణ మార్నింగ్ షో 'డిస్కో రాజా- డిస్కో రాణి'కి వెళ్లాడనీ, కేవలం తమని మోసం చెయ్యడంకోసం చేతుల్లో పుస్తకాలు పట్టుకున్నాడనీ ఆ తల్లి దండ్రులకు తెలియదు.

రమణ ఈ మధ్య ఏమాత్రం చదువులో శ్రద్ధ చూపడంలేదన్న విషయమూ వారు ఎరుగరు.

గత పరీక్షల్లో రమణకు తక్కువ మార్కులు వచ్చినందుకు చింతించి అతనికి కష్టంగా వున్న సబ్జక్టులలో తనకు శాహతుకు మించినదే అయినా ప్రైవేటు పెట్టించారు పార్వతీశంగారు. ఇంటి అద్దెగా వస్తున్న సొమ్ములు పూర్తిగా అ ట్యూషన్‌కు ఖర్చుఅయిపోతున్నా.... అందువల్ల కొన్ని ఇబ్బందులు కలుగుతున్నా .... లక్ష్యపెట్టలేదు ఆయన. అందుకు కారణం ఆయన కన్నులముందు కొడుకు బంగారు భవిష్యత్తుగురించి కలలు కదలడమే. కానీ రమణ మాత్రం ఆ బంగారు కలల్ని కంగారు కలలుగా మార్చేస్తున్నాడు.

పాపం.... ఆయనకు కన్నవారిద్వారా ఎన్ని కష్టాలు!

* * *

మర్నాడు ఎండ తక్కువగా ఏం లేదు.

'చైత్రంలోనే రోహిణికార్తి వచ్చినట్లు ఉంది' అనుకున్నాడు పార్వతీశం గారు.

ఉదయం పది గంటలు అవుతూనే



ఆయన చూపులు గేటుకు అంకితం అయ్యాయి.

పోస్టుమేన్ వచ్చి ఒక కార్డు విసిరి వెళ్ళిపోయాడు.

"నేను ఎదురుగానే కూర్చున్నాను.... చేతిలో పెట్టి వెళ్ళొచ్చు గదా.... ఎందుకలా విసిరికొట్టడం?" అని చిరాకుపడ్డారు.

అది పోస్టుమేన్ ఉద్యోగానికి ఒక క్వాలిఫికేషన్ కాబోలు....

ఆత్రంగా ఆ కార్డు తీసి చదివారు.

"పార్వతీశంగారికి—

వెంకట్రావు నమస్కారములు. ఈ క్రింద ఇచ్చిన చిరునామాలో ఒకసారి కలుసుకోండి."

వెంకట్రావు అంటే అంజలిని చూసుకుందుకు వచ్చిన అబ్బాయి తండ్రి.

"రుక్మిణీ...." గట్టిగా కేక పెట్టారు ఆయన.

"ఏమండీ?" అంటూ వచ్చింది ఆమె.

"నాకు త్వరగా భోజనం వడ్డించు.... వెంకట్రావుగారు ఉత్తరం రాశారు.... వెళ్ళి కలవాలి...." అన్నారు.

"ఏం రాశారు?"

"ఏమీ రాయలేదు. వ్యవహారం కాయా పండా అన్న విషయం తేల్చలేదు. కలుసుకొమ్మని రాశారు...."

"ఇప్పుడు వెళ్తారా?"

"అవును.... ఏం?"

"చాలా ఎండగా వుంది. సాయంత్రం తీరిగ్గా వెళ్ళవచ్చు కదా!" అంది ఆమె.

"కాదు-నాకు చాలా ఆత్రంగా వుంది... పరీక్షలు బ్రహ్మాండంగా రాసినా ఫలితాలు వచ్చేరోజున విద్యార్థి మనసులో అలజడి సహజం. నా పరిస్థితి అలాగే వుంది. విషయం నిశ్చితంగా తేల్చుకునేవరకూ అంతే...." అన్నారు ఆయన.

"వద్దండీ.... మీకు అసలే ఎండ పడదు.... పైగా పైబడిన వయసు.... సాయంత్రం వెళ్ళండి.. ఊళ్ళోనే కదా.." అంది.

"ఫరవాలేదు... భోజనం వడ్డించు .." అంటూ లేచారు ఆయన.

"ఒరేయ్ రమణా! మీ నాన్నగారితో పాటు నువ్వూ వెళ్ళరా.... నాకు కొంచెం ధైర్యంగా ఉంటుంది...." అంది రుక్మిణి కొడుకుతో.

"ఎలాగమ్మా? చదువుకునేందుకు వస్తానని ఒక ఫ్రెండుతో చెప్పాను.... పైగా పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి...." అన్నాడు రమణ.

నిజానికి అతడు ఫ్రెండుతో "భాగ్యనగరంలో బుచ్చిబాబు" సినిమాకు వెళ్ళాలని ప్రోగ్రాం వేసుకున్నాడు. అది పాడు కావడం అతనికి ఇష్టంలేదు.

"ఛాదస్తం పెట్టుకోకు.... వాడిని చదువుకోనియ్యి .... నేను వెళ్ళి

వస్తాను....” అన్నారు పార్వతీశంగారు భోజనానికి కూర్చుంటూ.

ఆయన సరిగ్గా భోజనం చెయ్యలేక పోయారు. ఏదో ఆయిందనిపించారు.

బట్టలు మార్చుకుని బయలుదేరబోతూ—

“గొడుగు ఏదీ?” అన్నారు.

రుక్మిణి ఇల్లంతా వెతికింది కానీ కనిపించలేదు.

“గొడుగు చూసేవా?” అడిగింది అంజలిని.

“నిన్న పక్కింటి పిన్నిగారు తీసుకు వెళ్ళి పాడుచేసి తెచ్చారు. ‘ఏమండీ’ అంటే ‘సారీ’ చెప్పారు. బాగుచేయించక పోతే పనికిరాదు. అందుకే మూల పడే శాను” అంది అంజలి.

“ఏదీ .... ఇలా తీసుకురా....” అన్నారు పార్వతీశంగారు.

తీసుకువచ్చి ఇచ్చింది అంజలి. చూస్తేనే బాధ కలిగింది. రెండు ఊచలు విరిగిపోయాయి. తెరవడానికి రాలేదు. చిరాకుపడ్డారు ఆయన.

“దారిలో బాగుచేయించుకుని వెళ్ళండి....” అంది రుక్మిణి.

“అంత టైము లేదు. వెళ్తున్నాను” అంటూ గొడుగు తీసుకోకుండానే చేతి సంచీతో రోడ్డుమీదకు వచ్చారు. గుమ్మం దిగితే చాలు.... ఆయన చేతిలో సంచీ వుండాల్సిందే. ఆయన అలవాటు అది.

రోడ్డుమీదకు రాగానే నిప్పుల్లో మూకి నట్లు తోచింది ఆయనకు. అవును మరి! ఎండ చాలా తీవ్రంగా ఉంది. లంచం దొరకని లంచగొండి ఆఫీసరులా మండి పోతోంది.

వేగంగా అడుగులు వెయ్యసాగారు... ఇంచుమించు అరకిలోమీటరు నడిస్తేగానీ సిటీ బస్‌స్టాపు రాదు. ఆ ఎండలో.... కారుతున్న చెమటల్ని కండువాతో తుడుచుకుంటూ బస్‌స్టాపు చేరుకున్నారు. నాలుక తడి ఆరిపోయింది. షోడా తాగా లని అనిపించింది. దగ్గర్లోవున్న దుకాణంకి వెళ్ళి షోడా తాగారు. పర్సుతీసి చూస్తే చిల్లర కేవలం పదిహేను పైసలు వుంది. మిగతావన్నీ నోట్లు. ఆ పదిహేను పైసలు షోడాఅబ్బాయికి ఇచ్చి బస్సు కోసం ఎదురుచూస్తూ వుండిపోయారు.

అరగంట గడిచిపోయింది. కానీ బస్సు రాలేదు.... నిజమే మరి! వెంటనే వచ్చేస్తే దాన్ని ‘సిటీబస్సు’ అని ఎందుకు అంటాం?

మొత్తానికి బస్సు వచ్చింది. బస్సు ఎక్కారు.

పర్సు తీసి రెండురూపాయల కాగితం ఇచ్చారు.

“చిల్లర ఇయ్యండి....” అన్నాడు కండక్టరు నిర్లక్ష్యంగా.

“లేదు బాబూ....” అన్నారు పార్వతీశంగారు మెత్తగా.

“అయితే దిగిపొండి....” అంటూ “స్టాప్....” అని అరిచాడు డ్రైవరు వినేలా.

బస్సు ఆగింది.

“చాలా అవసరం పనిమీద వెళ్తున్నాను బాబ్బాబూ....దిగమనకు. చిల్లర తర్వాత ఇయ్యి....” అన్నారు పార్వతీశం గారు.

“చిల్లర తర్వాత ఇస్తాను అంటూ కండక్టర్లు చిల్లరడబ్బులు తినేస్తున్నారని మా మీద పేపర్లలో రాస్తున్నారు. అందుకే ఆ పద్ధతి మానేశాను.... దిగండి....” అన్నాడు.

కండక్టర్ ముఖంలోకి ఆశ్చర్యంగా చూశారు ఆయన.

“త్వరగా దిగండి.... మీ వల్ల మాకు అనవసరంగా ఆలస్యం అవుతోంది....” అన్నారు ఎవరో.

దాంతో పార్వతీశంగారి అహం దెబ్బ తిన్నది.

వెంటనే బస్సు దిగిపోయారు. అక్కడకు దగ్గర్లోవున్న స్టాపుదగ్గరకి నడి చారు.

ఇంకో బస్సు మరొక పది నిముషాల తర్వాత వస్తే అందులో ఎక్కారు.

ఆ కండక్టరు రెండురూపాయలు తీసుకుని ఒక రూపాయి తిరిగి ఇచ్చి—“మిగతా చిల్లర తర్వాత తీసుకోండి....”అన్నాడు.

సరేనంటూ తల ఊపారు ఆయన. ఆయన దిగవలసిన స్టేజి వచ్చింది.

దిగబోతూ— “చిల్లర ఇయ్యాలి....” అన్నారు.

“లేదుసార్.... డిపోదాకా రండి. అక్కడ ఇస్తాను....” అన్నాడు కండక్టరు.

పార్వతీశం వెనకాల నిలబడ్డవాళ్ళు “దిగండి.... దిగండి....” అని తొందర చేశారు.

తన పని గుర్తువచ్చి దిగిపోయారు. బస్సు వెళ్ళిపోయింది.

చిల్లరవున్న ఆ కండక్టరు సంతోషంగా పర్సులోంచి అరవై పైసలు తీసుకుని జేబులో వేసుకున్నాడు.

పార్వతీశంగారు టైము చూసుకున్నారు పన్నెండు కావస్తోంది.

వడివడిగా వెంకట్రావు ఇంటివైపు అడుగులు వేశారు.

కొంచెం ఆయాసం వచ్చింది నడక వేగం తగ్గించారు.

నెమ్మదిగా నడిస్తే ఎండవేడి తట్టుకో లేకపోతున్నారు. వేగంగా నడిస్తే ఆయాసం.... తన పరిస్థితికి తనకే నవ్వు వచ్చింది.

వెంకట్రావుగారి ఇల్లు చేరి తలుపు తట్టారు.

వెంకట్రావుగారు ఇంట్లోనే వున్నారు. తెలుగువాళ్ళ ఆత్మగౌరవాన్ని కాపాడే ప్రభుత్వం చలవవల్ల మూడేళ్ళ ముందుగానే రిటైర్ అయిన వ్యక్తి ఆయన.

తలుపు తీసి___

"మీరా!.... రండి.... ఏమిటింత ఎండన పడివచ్చారు!" అన్నారు వెంకట్రావుగారు.

మండుతున్న ఎండకి తారును కరగబెట్టుకుంటున్న రోడ్డుమీంచి ఇంట్లోకి వస్తే.... నరకంలోంచి స్వర్గంలోకి వచ్చినట్లనిపించింది పార్వతీశంగారికి.

"కూర్చోండి...." అంటూ కుర్చీ చూపించారు వెంకట్రావుగారు.

లోపలకు చూస్తూ భార్యను పిలిచి మంచినీళ్ళు తీసుకురమ్మన్నారు.

పార్వతీశంగారు కూర్చుని వెంకట్రావు భార్య వరలక్ష్మి ఇచ్చిన మంచినీళ్ళ గ్లాసు అందుకున్నారు.

"మీ మంచి ఉత్తరం...." అంటూ మాటల్ని మధ్యలో ఆపి నీళ్ళు తాగారు పార్వతీశంగారు.

వెంకట్రావు నొచ్చుకుంటున్నట్లు___

"నిజమే.... ఇంతవరకూ మీకు ఉత్తరం రాయకపోవడం పొరపాటే..." అన్నారు.

గ్లాసు క్రింద పెడుతూ ఆశ్చర్యంగా చూశారు పార్వతీశంగారు.

"అదేమిటి అలా అంటారు! ఉత్తరం రాశారుగా...." అంటూ జేబులోంచి ఉత్తరం తీసి వెంకట్రావుగారికి అందించారు.

దాన్ని పరీక్షగా చూసి_ "అప్పే ఈ ఉత్తరం నేను రాయలేదు...." అన్నారు.

పార్వతీశంగారిలో లెక్కలేనంత నిరాశ తొంగిచూసింది.... ఆ ఉత్తరం చూసే.... ఏవేవో ఆశలు పెట్టుకునే ఇంత ఎండను లెక్కచెయ్యకుండా వచ్చింది. ఈ పెద్దమనిషి ఇలా అంటాడేమిటి?

మరొకసారి ఆ ఉత్తరంలోకి తొంగి చూస్తూ..

"చేతిరాత చూస్తే మా అబ్బాయిదిలాగ వుంది...." అన్నారు వెంకట్రావుగారు.

ఇంతవరకూ మౌనంగా ఆ సంభాషణ వింటున్న వెంకట్రావుగారి అమ్మాయి___

"మన నిర్ణయం జరిగిపోయేకా వాళ్ళకు చెప్పడంలో ఆలస్యం చెయ్యకూడదు. వాళ్ళకు మనకంటె ఎక్కువ ఆత్రత వుంటుంది. నేనే వాళ్ళకు ఉత్తరం రాసేస్తాను...." అని అన్నయ్య ఒకసారి నాతో అన్నాడు. సరదాగా అన్నాడని అనుకున్నా.... నిజంగానే ఉత్తరం రాశాడన్నమాట...." అంది.



అప్పుడు వెంకట్రావుగారికి పరిస్థితి పూర్తిగా తెలిసింది.

"ఆహా! అలాగా.... మంచి పనే చేశాడు" అన్నారు వెంకట్రావుగారు తృప్తిగా.

పార్వతీశంగారు ఆత్రంగా వాళ్ళ సంభాషణ వింటున్నారు.

అప్పుడే వరలక్ష్మి ఒక గాజుగ్లాసులో చల్లని డ్రింకు తీసుకొచ్చి పార్వతీశంగారికి ఇచ్చింది.

"మీ అమ్మాయి మాకు నచ్చింది. ముహూర్తాలు పెట్టుకోవడమే తరవాయి. ఈ విషయం ఉత్తరంద్వారా తెలియపర్చకుండా స్వయంగా వచ్చి చెప్పాలనుకున్నాను. కానీ కొంచెం అశ్రద్ధచేశాను. మీరు చాలా ఆత్రంతో ఎదురుచూస్తూ వుంటారన్న విషయం నేను గుర్తించలేదు. పొరపాటే.... మా అబ్బాయి మంచి పనే చేశాడు...." అన్నారు వెంకట్రావుగారు.

పార్వతీశంగారి ముఖంలో సంతోషం ప్రకటితమైంది.

ఆయన తాగుతున్న డ్రింకుకంటె ఎన్నోరెట్లు చల్లనైనది ఆ వార్త.

"చాలా.... చాలా సంతోషం బావగారూ!" అన్నారు ఆయన.

వెంకట్రావుగారు చిన్నగా నవ్వారు.

"మరొక విషయం చెప్పడం మరిచాను బావగారూ! కట్నంగా ఒక్క పైసా కూడా వద్దు."

నమ్మశక్యం కానట్లు చూశారు పార్వతీశంగారు.

"అవును బావగారూ! అలా చూస్తారేం! నేను నిజమే చెప్తున్నాను. ఇది మా అబ్బాయి నిర్ణయం. దాన్ని మేము ఆచరిస్తాం.... అబ్బాయి, అమ్మాయి సుఖంగా వుండటంకంటె నేను ఏమీ కోరుకోను. మీ అమ్మాయిని మనస్ఫూర్తిగా ఇష్టపడ్డాడు వాడు."

"కృతజ్ఞుడిని.... ఈ రోజుల్లో మీలాంటివారు చాలా అరుదు...." అన్నారు పార్వతీశంగారు. నిజానికి ఆయన గొంతు సంతోషంతో నిండిపోయి మాటలే రావడంలేదు.

వరలక్ష్మి అందుకుంది.

"అన్నయ్యగారూ! ఈ రోజుల్లో కట్నాలు వద్దంటూనే లాంఛనాల పేరిట అంతకంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారు కొందరు. మేం అలాంటి వాళ్ళం కాదు. మాకు మీ నుంచి పైసా కూడా వద్దు."

పార్వతీశంగారి చెవుల్లో అమృతం పోస్తున్నారు ఆ దంపతులు.

ఆయన ఆనందానికి హద్దులు లేవు.

"మేం చాలా అదృష్టవంతులం. అందుకే మీలాంటి వారితో వియ్యం

పొందగలుగుతున్నాం. అమ్మాయి పెళ్లి కోసం కొంత సొమ్ము కూడబెట్టాను. మీరు ఏమీ వద్దని అన్నా అమ్మాయిని వట్టి చేతుల్తో పంపను. ఆమె సంసారానికి కావల్సినవి కొని ఇస్తాను...." అన్నారు పార్వతీశంగారు.

"అది మీ ఇష్టం.... అదే మీకు తృప్తి అనుకుంటే అందుకు మేము అడ్డురాము. మాకంటూ ఏమి వద్దు." అన్నారు వెంకట్రావుగారు.

"మీకు నేను ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియటంలేదు. మా అమ్మాయి అదృష్టవంతురాలు.... మీ చల్లని నీడలో ఆమె జీవితం మూడు పువ్వులు, ఆరు కాయలు కాగలదు. ఒకదాని తర్వాత ఒకటిగా వినిపించిన ఈ శుభవార్త నన్ను నిలువనీయటంలేదు...." అన్నారు పార్వతీశంగారు.

"అబ్బాయికి అమ్మాయి నచ్చింది.... అబ్బాయి అదృష్టం నాకు నచ్చింది..... ఇందులో మీరు పెద్దగా కృతజ్ఞతలు చెప్పుకోవలసిన అవసరంలేదు." అన్నారు వెంకట్రావుగారు.

పార్వతీశంగారి కళ్లముందు కుర్రవాడు మెదిలాడు.

అందమైన రూపంతో పాటు అందమైన అంతరంగం వున్నవాడన్నమాట.. శభాష్!

"వీలైనంత త్వరలో ముహూర్తాలు పెట్టించాలి." అన్నారు వెంకట్రావుగారు.

"అలాగే.... శుభస్య శీఘ్రం.... నేను వెంటనే పురోహితుని కలుసుకుని ముహూర్తాల గురించి తెలుసుకుని.... ఆ వివరాలతో తిరిగి మీ దర్శనం చేసుకుంటాను." అంటూ లేచారు పార్వతీశంగారు.

అప్పుడు సమయం ఒంటి గంట అయ్యింది. అత్తమీద కోపం దుత్తమీద చూపిన చందాన ఎవరిమీదనో వచ్చిన కోపాన్ని మనుషుల మీద చూపిస్తున్నాడు సూర్యుడు.

"ఇప్పుడు వెళ్తారా?.... చల్లబడిన తర్వాత వెళ్లవచ్చు....ఏం తొందర?" అన్నారు వెంకట్రావుగారు.

"అవును అన్నయ్యగారూ! చాలా ఎండగా వుంది బయట...." అంటూ వంతపాడింది వరలక్ష్మి.

పార్వతీశంగారికి ఇక వుండాలనిలేదు. ఎంత త్వరగా ఇంటికి వెళ్లి ఈ వార్త భార్యకు అందచేద్దామా అని వుంది.

ఒకసారి బయటకు చూశారు. ఎండ వుంది గాని అది పెద్ద ఎండగా తోచలేదు ఆయనకు ఆ సమయంలో.

"లేదు. వెళ్తాను. మా ఆవిడకు ఈ వార్త చెప్పాలి." అన్నారు.

"పోనీ.... గొడుగు తీసుకు వెళ్తారా?" అడిగేరు వెంకట్రావుగారు.



"అక్కర్లే.... అవసరంలేదు.... పెద్ద ఎండ ఏముంది గనుక? మొన్ననే కదా చైత్రం వచ్చింది....వస్తాను. శలవు.... నమస్కారం...." అంటూ గుమ్మం దిగేరు పార్వతీశంగారు.

రోడ్డుమీద....ఎండలో.... వడివడిగా అడుగులు వెయ్యసాగారు.

నిజానికి ఉదయం ఉన్న ఎండ కంటే ఇప్పుడు ఎక్కువ వుంది.... ఉదయం ఎండను భరించలేకపోయిన ఆయన్ని ఈ ఎండ ఏమీ చెయ్యలేకపోతోంది.

ఆయనకు ఈ ఎండ ఉనికే తెలియటం లేదు.

బస్‌స్టాప్ దగ్గరకు వచ్చి నిలబడ్డారు. ఆ తర్వాత ఆయన దగ్గర్నుంచి అరవై పైసలు సొంతం చేసుకున్న కండక్టరు గుర్తువచ్చాడు.

'ఈ కండక్టరూ అలాగే చేస్తాడు.... ఇంతకంటె నడవడం మంచిది..... ఆమాత్రం నడవలేనా?' అనుకుంటూ ఆ ఎండలో నడక సాగించారు.

ఆయన మానసిక పరిస్థితి ఎండను లెక్కచెయ్యటం లేదు.

పైగా అదేదో పండువెన్నెలలా తోస్తోంది.

ఒక కిలోమీటరు బాగానే నడిచారు.

భూమిమీద వున్న నీరంతా పీల్చి పారెయ్యాలన్న కసితో సూర్యుడు మండిపోతూనే వున్నాడు. మనుషులందరికీ తాపం కలిగిస్తున్నాడు. తాత్కాలిక ఉపశమనంకోసం కూల్‌డ్రింక్ దుకాణాల ముందు గుమిగూడారు. సినిమా బాగా లేకపోయినా, ఎయిర్‌కండిషన్డు థియేటర్ అయితే రష్ బాగానే వుంది.

అప్పుడే పార్వతీశంగారి కుడికాలి చెప్పు తెగింది.

అటు, ఇటు చెప్పులు కుట్టేవాడికోసం చూశారు. ఎవరూ కనిపించలేదు. కాళ్ల క్రింద చెప్పు వుంచుకుని కష్టపడుతూ అడుగులు ఈడుస్తూ నడిచారు. అలా నడవడం కష్టంగా ఉంది. పైగా వేగం బాగా తగ్గిపోయినందువల్ల ఎండకు నెత్తి మాడుతోంది.

ఇప్పుడు ఎలాగ?

ఒక నిమిషం ఆలోచించేరు. ఒకే ఉపాయం తట్టింది.

ఆ చెప్పులు తీసేసి చేతిలో వున్న సంచిలో పడేశారు. నగ్న పాదాలతో నడువసాగారు.

నిప్పుల మీద నడక.... అయినా ఆయనకు ఎందుకో బాధ అనిపించలేదు.

అలాగే నడవసాగారు.... వడివడిగా.

ఇదివరకు రోలులా వుంది ఆయన పరిస్థితి.... కేవలం నెత్తి మాడటం వల్ల ఇప్పుడు మద్దెలలా మారింది.... పైనుంచి నెత్తి, క్రిందనుంచి కాళ్లు.... రెండూ

మాడు తున్నందువల్ల.

పోనీ.... బస్సు ఎక్కితే?

అఁ.... ఎందుకు? సగానికి పైగా దూరం వచ్చేశాకా ఇక బస్సు ఎక్కడం అనవసరం....

అందుకే మళ్లీ వడివడిగా........

ఆడపిల్ల పెళ్లి కుదిరితే ఆ తండ్రికి ఎంతో ఆనందం కలుగుతుంది.

అది కూడా కట్నరహిత వివాహం అయితే ఆ ఆనందం మరింత—

ఆడపిల్ల పెళ్లి కుదరడం అన్నది చాలా సాధారణ విషయం కావచ్చు కానీ ప్రస్తుత సామాజిక వ్యవస్థలో అది అసాధారణ విషయమే.... అందుకు కారణాలు విడిగా చెప్పక్కర్లేదు. అది నిర్వివాదాంశం.

ఈ అసాధారణ విషయమే ఇప్పుడు పార్వతీశంగారిలో ఎండకు తట్టుకోగల ధైర్యం తెచ్చింది. వెంకట్రావుగారి ఇంటికి వెళ్తున్నప్పుడు ఆయన్ని బాధించిన ఎండ ఇప్పుడు ఆయన్ని బాధించటం లేదు.

చెమటలు తుడ్చుకుంటూ ఇల్లు చేరారు.

ఇంట్లో ఒక పదిమంది దాకా చుట్టుపక్కల ఇళ్లవాళ్లు కూర్చున్నారు. వారంతా ఈ సమయంలో ఎందుకు వచ్చారో అర్థంకాలేదు. ఎండలో నడచి వచ్చిన శ్రమలో.... శుభవార్త ఆయనలో కలిగించిన ఆనందంలో.... ఆయన రుక్మిణి ముఖం కళతప్పి వుండటం గమనించలేకపోయారు.

"ఇంత ఎండలో వచ్చేరా?" అంది రుక్మిణి.

"అఁ.... వెంకట్రావు గారి ఇంటి దగ్గర్నుంచి నడుచుకుంటూ వచ్చేశాను." అన్నారు పార్వతీశంగారు.

"ఎండలో నడిచి వచ్చేరా?" అక్కడ వున్న ఒక పెద్దమనిషి కళ్లింతలు చేసుకుని అడిగేడు.

"అఁ.... పెద్ద ఎండ లేదులెండి...." అంటూ అతనికి జవాబు ఇచ్చి, భార్యతో.

"మన అంజలి నిజంగా అదృష్టవంతురాలు రుక్మిణీ। వాళ్లకు ఈ సంబంధం నచ్చిందట.... అబ్బాయే ఈ ఉత్తరం రాశాడట.... దాన్నిబట్టి అర్థం చేసుకో.... మన అమ్మాయి అంటే ఇప్పట్నుంచే అతనికి ఎంత ప్రేమో। పైగా మరొక విషయం.... కట్నం తీసుకోరట.... చూశావా.... ఎంతగొప్ప సంబంధం మనకు దొరికిందో. నాకు చాలా సంతోషంగా ఉంది."... అన్నారు. చాలా ఉత్సాహంగా.

రుక్మిణి ముఖంలో సంతోషం కనిపించలేదు.

"అదేమిటి? ఇంత చక్కని వార్త విని అలాగ వుండిపోయావు?.... ఈ వార్త నీకు ఎంత త్వరగా వినిపించుదామా అని.... ఈ ఎండలోనే వచ్చాను...." అన్నారు. ఆయన సంతోషంతో.

తన పెద్ద కొడుకు తనను పట్టించుకోవటంలేదన్న బాధ ఆయన ఆ క్షణంలో మరిచిపోయేరు.

తన పెద్దకూతురు తలచెడి పుట్టింటికి చేరిందన్న బెంగ ఆయన ఆ క్షణంలో మరిచిపోయేరు.

ఆడపిల్లకు పెళ్లి జరగడం ఎంత ముఖ్యమో.... ఆ పెళ్లి కుదిరిన సంఘటన ఆడపిల్ల తండ్రి జీవితంలో అంత ముఖ్యమూను.

రుక్మిణి కళ్లలో కన్నీళ్లు....

"మరీ అంత సంతోషమా? ఎందుకా ఆనందభాష్పాలు?".... అడిగేరు.

ఎలా జవాబు చెప్పాలో తెలియక.... మాటరాక.... అలాగే నిలబడిపోయింది రుక్మిణి.

పార్వతీశంగారు అలా వెంకట్రావు గారి ఇంటికి వెళ్లాక—

అంజలి నీళ్లు తేవడంకోసం బిందె తీసుకుని పెరట్లో నూతి దగ్గరకు వెళ్లిందనీ.... నీళ్లు తోడుతుండగా చేద నీటిలో పడిపోవడంతో ఆత్రంగా లోపలకు తొంగిచూసిందనీ....

పట్టుతప్పి నూతిలో పడిపోయిందనీ

మరొక అరగంటదాకా ఆ విషయం ఎవ్వరికీ తెలియక .... తర్వాత అంజలి ఏదా అని నూతి దగ్గర బిందెను చూసి నూతి దగ్గరకు వెళ్తే ఆమె నూతిలో శవంగా తేలిందనీ....

ఇరుగు పొరుగులు వచ్చి ఆమె శవాన్ని బయటకు తీసి నూతి గట్టున ఉంచారనీ....

భర్త గొంతువిని తను ఇలా బయటకు వచ్చిందనీ....

ఎలా చెప్పాలో తెలియక.... మాట రాక.... అలాగే నిలబడిపోయింది రుక్మిణి.

బయట ఫెళ్లున ఎండ కాస్తోంది.

సహనవంతురాలు అయిన భార్య మీద చీటికిమాటికీ ముఖం ఎర్రగా చేసుకుని చికాకుపడే కోపిష్టి భర్తలాగ.... సూర్యుడు మండిపోతున్నాడు।

